సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



భక్తిలో అహంభావం కూడదు

దైవ సేవలో అహంభావాన్ని విడనాడాలని ఆత్మానంద స్వామి తెలిపారు. శౌర్య జాగరణ రథ యాత్రలో ప్రవచించారు. 8లో



పర్యాటకాభివృద్ధికి చర్యలు

జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఐటీడీఏ పీవో సూరజ్ గానోరే తెలిపారు. 8లో



బంతి సాగుతో లాభాలు

గిరిజన రైతులు బంతి సాగుతో లాభాలు పొందుతున్నారు. జిల్లాలో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. 9లో



ఫలిస్తున్న కృషి..

ప్రకృతి వ్యవసాయంలో వేసిన సామల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

- ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరుగుతున్న ప్రకృతి వ్యవసాయం
- 22 మండలాల్లో 248 పంచాయతీల్లో సాగు
- 515 గ్రామాల్లో పూర్తిగా ఇదే పద్ధతిలో..
- మహిళా రైతులకు భాగస్వామ్యం

విస్తరిస్తున్న ‘ప్రకృతి’

రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం అనర్థాలకు దారితీస్తోంది. మట్టిలో సత్తువ తగ్గి, సాగుకు మేలు చేసే సూక్ష్మ జీవులు అంతరించిపోతున్నాయి. దీంతో సాగు ఖర్చు నానాటికీ పెరుగుతూ గిట్టుబాటు లభించక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చు అయ్యే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ సహజ వ్యవసాయం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ప్రభుత్వ కృషి ఫలిస్తోంది. ప్రకృతి వ్యవసాయం జిల్లాలో విస్తరిస్తోంది.



ఘనామృతంతో తయారు చేసిన గులికలు

పెదబయలు: పుడమి తల్లిని సారవంతంగా ఉంచడమే కాకుండా తక్కువ ఖర్చుతో జరిగే ప్రకృతి వ్యవసాయం వైపు జిల్లా రైతులు దృష్టి సారిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ సహజ వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ప్రాజెక్టు ఆధ్వర్యంలో పూర్వ పద్ధతిలోనే ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. అధికారులు తీసుకున్న చర్యలతో రసాయన ఎరువులు, పురుగు మందులు,కలుపు మందులు అవసరం లేకుండా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఇప్పుడు రైతులు మక్కువ చూపుతూ బంగారు పంటలు పండిస్తున్నారు.

49,503 హెక్టార్లలో..

జిల్లాలోని పాడేరు,చింతూరు,రంపచోడవరం ఐటీడీఏల పరిధిలో 22 మండలాల్లో 248 గ్రామ పంచాయతీల్లోని 581 గ్రామాల్లో 53,629 మంది రైతులు, 49,503 హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. పెదబయలు మండలంలోని గలగండ, గంపరాయి,అరడకోట, సీకరి,సీతగుంట,వనభంగి పెదకోడాపల్లి,అడుగులపుట్టు పంచాయతీల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు.

మూడేళ్లలో 60 శాతం పెంపు

జిల్లాలో ప్రతి నెలా గ్రామాల్లో 25 నుంచి 30 అవగాహన సదస్సులను అధికారులు నిర్వహిస్తున్నారు. నెలకు ఒకసారి డివిజన్ స్థాయిలో సమీక్ష నిర్వహించి తీసుకోవలసిన చర్యలపై చర్చించి, గ్రామాల్లో సదుస్సులు జరిగినప్పుడు రైతులకు వివరిస్తున్నారు. దీంతో గత మూడేళ్లతో పోల్చుకుంటే జిల్లాలో ఇప్పుడు 60 శాతం ప్రకృతి వ్యవసాయం పెరిగింది. రాష్ట్రంలో అధికంగా ప్రకృతి వ్యవసాయం చేసే జిల్లాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా ఒకటి.

విత్తు నుంచి పంట చేతికందే వరకు..

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అధికారులు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు. విత్తు వేసే దగ్గర నుంచి పంట చేతికి అందేవరకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ద్రవ,ఘనామృతాలు,చీడపీడల నివారణకు కషాయాల తయారీ వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యక్షంగా చేసి చూపించడంతో పాటు వారితో తయారు చేయిస్తున్నారు. ఎటువంటి ఖర్చులేకుండా స్థానికంగా దొరికే వాటితో సేంద్రియ ఎరువులు తయారు చేసి, ఉపయోగించి అన్నదాతలు మంచి దిగుబడులు సాధిస్తున్నారు. భవిష్యత్తులో ఆర్గానిక్ పంటలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉండడంతో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మక్కువ చూపిస్తున్నారు.



సిరశపల్లి గ్రామంలో సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

53,629 మంది మహిళ రైతులకు అవగాహన

జిల్లాలో గ్రామ స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళ రైతులను ఎంపిక చేసి, ప్రకృతి వ్యవసాయంపై తర్ఫీదు ఇస్తున్నారు. 53,629 మంది మహిళ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మహిళలు సేంద్రియ ఎరువుల తయారీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. జిల్లాలో వాతావరణం ప్రకృతి వ్యవసాయానికి మరింత అనుకూలంగా ఉంది. ప్రకృతి వ్యవసాయానికి మన్యం కేరాఫ్‌గా మారనుంది.

రెండేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం



రెండేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. వరి, రాగులు,సామలు,రాజ్‌మా, మినుములు,మొక్కజొన్న, ఆకుకూరలు సాగు చేస్తున్నాను. మంచి దిగుబడి వచ్చింది. చాలా తక్కువ ఖర్చుతో కషాయాలు, ఘన,ద్రవామృతాలు తయారు చేసి వినియోగించాను. గ్రామంలో ఎక్కువ మంది రైతులు నన్ను అనుసరిస్తున్నారు.

– అంబిరి లావణ్య, సిరశపల్లి గ్రామం,పెదబయలు మండలం

జిల్లాలో 515 బయో విలేజ్‌లు

జిల్లాలో శతశాతం ప్రకృతి వ్యవసాయం చేసే 515 బయో విలేజ్‌లను ఎంపిక చేశాం.ఈ గ్రామాల్లో రసాయన ఎరువుల జోలికిపోకుండా సాగు చేస్తున్నారు. రెండేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం పెరుగుతోంది.అతితక్కువ ఖర్చుతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవడంపై మహిళ రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఏపీసీఎన్ఎఫ్‌తో 13 ఎన్‌జీవోలతో కలిసి ప్రకృతి వ్యవసాయంపై పని చేస్తున్నాం. దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆర్గానిక్ పంటలకు మంచి గిరాకీ ఉంది. జిల్లా రైతులకు ఆర్గానిక్ పంటలతో మంచి లాభాలు పొందే అవకాశం ఉంది.

– భాస్కర్‌రావు, ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్

త్వరితగతిన రెండో విడత నాడు-నేడు పనులు

కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు: జిల్లాలో రెండో విడతలో మంజూరు చేసిన మనబడి నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, సహాయ గిరిజన సంక్షేమాధికారులతో సోమవారం నాడు-నేడు రెండో విడత పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత వరకు జరిగిన పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మండలాలవారీగా అందుబాటులో ఉన్న నిధుల గురించి ఎంఈవోలను అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు పనులకు నిధుల కొరతలేదని, జాప్యం చేయకుండా పూర్తి చేయాలన్నారు.

ఎలక్ట్రికల్ వైరింగ్ పనులు, మరుగుదొడ్ల నిర్మాణాలు, పాఠశాలలకు తాగునీటి, ఇతర మౌలిక సదుపాయాల పనులు నిర్దిష్టమైన సమయానికి పూర్తి చేయాలని చెప్పారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు కేటాయించిన నిధులను బదలాయించాలని చెప్పారు. బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నిధులపై ఆరా తీశారు. సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నాడు-నేడు పనులను పర్యవేక్షించి పురోగతిపై ఎంఈవోలకు నివేదించాలని సూచించారు. వచ్చే సోమవారం మళ్లీ ఈ పనులపై సమీక్షిస్తానన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

డ్రాపౌట్ విద్యార్థుల సమాచారం ఇవ్వకపోతే చర్యలు

పాఠశాలలవారీగా డ్రాపౌట్ విద్యార్థుల వివరాలు ఇవ్వని విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. భవనాలు లేని పాఠశాలలు, కొత్త పాఠశాలలు ఎన్ని అవసరం ఉందో పరిశీలించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. చైల్డ్ ఇన్ఫోవెబ్‌సైట్లో ఉన్న విద్యార్థుల వివరాలకు, వాస్తవానికి ఎంత తేడా ఉంది. వ్యత్యాసాలు ఎందుకు వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు.

ఉపాధ్యాయులు విధిగా ఎఫ్ఆర్ఎస్ హాజరు వేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి బి.గౌరీశంకర్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు, సమగ్ర శిక్ష ఏపీవో ఎస్.ఎల్.ఎన్.పాత్రుడు, మండల విద్యాశాఖాధికారులు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు, మండల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. మండలంలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. గడపగడపకు మన ప్రభుత్వం, ఎంపీ నిధులతో సుంకరమెట్ట జంక్షన్ నుంచి రంపుడువలస వరకు నిర్మిస్తున్న రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత లేకుంటే చర్యలు తప్పవన్నారు.

అనంతరం సీసీడీపీ నిధులతో యండపల్లివలసలో నిర్మిస్తున్న రోడ్డు పనులు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 10న బొండం పంచాయతీ రేగ గ్రామంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాట్లను పరిశీలించారు. శిబిరం విజయవంతానికి అధికారులందరూ కృషి చేయాలని తెలిపారు. అనంతరం రేగ పాఠశాలను సందర్శించి, కొద్ది సేపు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటేష్, తహసీల్దార్ వేణుగోపాల్, సర్పంచ్ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రహదారి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పీవో అభిషేక్

చింతపల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విక్రమ్

చింతపల్లిరూరల్: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ టి.విక్రమ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ జిల్లా తాళ్లరేవు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో పనిచేసి, బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు ఆస్పత్రి సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి, రోగులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానని చెప్పారు.



డాక్టర్ టి.విక్రమ్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సంతోష్



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అరకులోయటౌన్: చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమనిస్థానిక ఎస్‌ఐ సంతోష్ అన్నారు. స్థానిక స్పోర్ట్స్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఆటలు ఎంతోముఖ్యమని, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాంగి సూరిబాబు మాట్లాడుతూ అండర్ 14,17 విభాగాల్లో బాల,బాలికలకు పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో 80 మంది పాల్గొన్నట్టు తెలిపారు. పీడీలు తాంగుల లైకోన్, సద్దు, సుధాకర్, సంతోష్, కొండబాబు ఈ పోటీలను పర్యవేక్షించారు.

సమరోత్సాహం







విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఓపీ.. ‘అభా’తో హ్యాపీ

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆన్‌లైన్ ఓపీ
- అభా యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు
- క్యూల్లో వేచి ఉండక్కర్లేదు.. సమయం ఆదా.!

మహారాణిపేట: ప్రస్తుత డిజిటల్ యుగంలో అగ్గిపెట్టె నుంచి ఆడి కారు కొనుగోలు వరకూ ఆర్థిక లావాదేవీలు మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతున్నాయి. చిన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అవతలి వ్యక్తి ఖాతాలోకి డబ్బులు పంపుతున్నారు. ఇదే తరహాలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా అవుట్ పేషెంట్(ఓపీ) రిజిస్ట్రేషన్ పూర్తి చేసి డాక్టర్ అపాయింట్‌మెంట్‌కు టోకెన్ పొందే వెసులుబాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి వచ్చింది. డిజిటలైజేషన్‌లో భాగంగా అభా(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) యాప్‌లో రోగి వివరాలను నమోదు చేసి వైద్యం పొందే సేవలు ఇటీవల కేజీహెచ్, ఈఎన్‌టీ, ఛాతీ తదితర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రారంభమయ్యాయి. ఈ విధానంపై ఆస్పత్రిలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటుతో పాటు క్యూఆర్ కోడ్ పోస్టర్లు, ఓపీ రిజిస్ట్రేషన్ ఎలా చేసుకోవాలో అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలను అమర్చారు.

ఏమిటి లాభం?

దేశవ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు పొందే రోగుల వివరాలను ‘నేషనల్ హెల్త్ రికార్డ్స్’లో పొందుపరిచేందుకు ఆన్‌లైన్ అవుట్ పేషెంట్(ఓపీ) విధానాన్ని విస్తరిస్తున్నారు. క్యూలో వేచి ఉండే సమయాన్ని ఈ విధానం ద్వారా ఆదా చేసుకోవచ్చు. సాధారణంగా ఎవరైనా వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే తొలుత ఓపీ కౌంటర్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి. రోగి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఇతర వ్యక్తిగత వివరాలను వెల్లడించాలి. అనంతరం సంబంధిత విభాగానికి రోగికి ఓపీ టికెట్ ఇస్తారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యేందుకు కనీసం 5 నుంచి 10 నిమిషాలు పడుతుంది. పెద్దాస్పత్రుల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోగులు గంటల తరబడి క్యూలో నిల్చొని పడిగాపులు పడాల్సి వస్తుంది. అదే క్యూఆర్ కోడ్ ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్ చేసుకుంటే నేరుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌కు వెళ్లి టోకెన్ తీసుకుని డాక్టర్‌ను సంప్రదించవచ్చు. క్యూలో నిరీక్షించే అగచాట్లు తప్పుతాయి.

ఇదీ నమోదు విధానం

- స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్‌కు వెళ్లి.. ఏబీహెచ్ఏ(అభా) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఆయుష్మాన్ డిజిటల్ హెల్త్ అకౌంట్(అభా) 14 అంకెల గుర్తింపు/ఫోన్ నంబర్/మెయిల్ ఐడీ ద్వారా యాప్‌లో రిజిస్టర్ అవ్వాలి.
- యాప్‌లోకి లాగిన్ అయిన వెంటనే అభా వివరాలు ప్రత్యక్షం అవుతాయి. వీటిని ఆస్పత్రితో షేర్ చేసే ఆప్షన్ కనిపిస్తుంది. షేర్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే టోకెన్ నంబర్ వస్తుంది. ఈ టోకెన్ 30 నిమిషాల పాటు వ్యాలిడిటీలో ఉంటుంది.
- టోకెన్ నంబర్ వచ్చాక ఆస్పత్రిలో కౌంటర్‌కు వెళ్లి అభా గుర్తింపు నంబర్, ఫోన్ నెంబర్ తెలియజేసి ఏ స్పెషాలిటీలో ఓపీ అవసరమో చెబితే వైద్య సిబ్బంది చీటీ ఇస్తారు. దీన్ని తీసుకుని నేరుగా డాక్టర్‌ను సంప్రదించవచ్చు. సాంకేతిక సమస్య లేకపోతే ఇదంతా రెండు నిమిషాల్లోనే అయిపోతుంది. ఒక వేళ నెట్‌వర్క్ సమస్య ఉంటే కొంత టైమ్ పడుతుంది.
- ఆస్పత్రికి వెళ్లే ముందే ఇంటి వద్ద అభా యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే.. ఓపీ కౌంటర్ వద్ద పని సులువవుతుంది. ఒకసారి యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు పొందవచ్చు.
- ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు ఓపీ కౌంటర్ల వద్ద వైద్య సిబ్బంది ఉంటారు.
- ప్రస్తుతం పాత పద్ధతిలో ఓపీ చీటీలు ఇస్తూనే.. సమాంతరంగా అభా విధానాన్ని అమలు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ లేని వారు సిబ్బందిని సంప్రదిస్తే ఓపీ చీటీ ఇస్తున్నారు.

కేజీహెచ్‌లో ప్రస్తుత పరిస్థితి ఇదీ..

ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్‌లో ఓపీ చీటీల జారీకి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. కేజీహెచ్‌లో సోమవారం, బుధవారం, గురువారాల్లో రోగుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పెరుగుతున్న రోగులకు ఓపీ చీటీల జారీ కోసం కౌంటర్ల సంఖ్య పెంచారు. మొత్తం ఏడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని కౌంటర్లు పనిచేస్తాయి. ఇందులో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కౌంటర్లు, సీనియర్ సిటిజెన్లు, దివ్యాంగులకు ఓ కౌంటర్, కేజీహెచ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది, జర్నలిస్టులకు ఓ కౌంటర్, ఇన్ పేషంట్ కేసు షీట్లకు ఓ కౌంటర్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నుంచి రెండు కౌంటర్లు, రాత్రి సమయంలో రెండు కౌంటర్లు పని చేస్తున్నాయి.

ఈ కౌంటర్లలో ప్రతి రోజూ 1,400 నుంచి 1,500 ఓపీ చీటీలు, 200 నుంచి 300 వరకు ఇన్ పేషంట్ల కోసం కేసు షీట్లను జారీ చేస్తున్నారు. ఇక్కడ ఆన్‌లైన్ ఓపీ చీటీల జారీలో చిన్నపాటి సమస్యలు తలెత్తుతున్నాయి. నెట్‌వర్క్ సమస్య ఉంది. ఈ విధానంపై అవగాహన లేని వారు అక్కడే ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదిస్తే.. వారు తగిన సూచనలిస్తారు. అభా యాప్ లేకపోయినా పాత పద్ధతిలో ఓపీ చీటీలు పొందవచ్చు.




కేజీహెచ్‌లో ఓపీ కౌంటర్లు

ABHA



ఓపీ విభాగం లోపల కౌంటర్లు

‘అభా’తో రోగికి సమయం ఆదా



అభా యాప్ వల్ల రోగికి సమయం ఆదా అవుతుంది. ఒకసారి డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు పొందవచ్చు. ఈ యాప్‌పై రోగులకు అవగాహన కల్పించేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లో రోగి పేరు నమోదు వల్ల రూ.5 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. ఆశ, ఏఎన్ఎంలను సంప్రదించినా అభాలో పేర్లు నమోదు చేస్తారు.

– డాక్టర్ పి.అశోక్ కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్

న్యూస్‌రీల్

ఆధార్ కేంద్రాల్లో ధరల బోర్డులు తప్పనిసరి



చింతపల్లిలో ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న శాంతాలక్ష్మి

చింతపల్లిరూరల్: ఆధార్ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరల బోర్డులు తప్పనిసరిగా ఉండాలని జిల్లా డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ అధికారి శాంతా లక్ష్మి తెలిపారు. మండలంలోని ఆధార్, మీసేవ కేంద్రాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల యజమానులు తప్పనిసరిగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల జాబితా బోర్డులు ప్రజలకు కనిపించేలా ఏర్పాటు చేయాలని తెలిపారు.

మత్స్య సంపద వృద్ధికి కృషి



సూరంపాలెం జలాశయంలో చేప పిల్లలు విడుదల చేస్తున్న కామరాజు, శివ

గంగవరం: జలాశయాల్లో మత్స్య సంపద అభివృద్ధికి మత్స్యశాఖ కృషి చేస్తోందని ఆ శాఖ అభివృద్ధి అధికారి సీహెచ్.రమేష్ తెలిపారు. గిరిజన మత్స్యకారులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా 40 శాతం సబ్సిడీపై మంజూరు చేసిన చేప పిల్లలను సోమవారం జలాశయాల్లో కొత్తాడ, సూరంపాలెం సర్పంచ్‌లు శారపు కామరాజు దొర, బల్లెం శివ దొర విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సూరంపాలెం జలాశయంలో 16,000, రాములదేవపురం (ఏలేరు) జలాశయంలో 2,400 చేపపిల్లలను విడుదల చేసినట్టు తెలిపారు. మాజీ సర్పంచ్ చవలం సంకురుదొర, వీఎఫ్ఏ సీహెచ్. రామకృష్ణ,మత్స్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థితో హెచ్‌ఎం సెల్ఫీ

పాఠశాలల్లో వినూత్న కార్యక్రమం



విద్యార్థితో సెల్ఫీ తీసుకుంటున్న హెచ్‌ఎం విలియర్ కేరీ

డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఆదేశాల మేరకు పాఠశాలల్లో వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన సూచన మేరకు ఎఫ్ఏ 2 పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థితో పాఠశాల హెచ్‌ఎం సెల్ఫీ తీసుకుని పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. ఈ మేరకు కించుమండ పంచాయతీ కొసొంగుడ ఎంపీపీ పాఠశాలలో 4వ తరగతి విద్యార్థి సాకేరి అరుణ్‌తేజ్ మంచి మార్కులు సాధించడంతో ఆ పాఠశాల హెచ్‌ఎం విలియం కేరీ, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపి, సెల్ఫీ తీసుకున్నారు.

పొంగి ప్రవహించిన వాగులు



రాజవొమ్మంగి వద్ద రహదారిపై నుంచి ప్రవహిస్తున్న కొండ వాగు నీరు

రాజవొమ్మంగి: స్థానికంగా, ఎగువన భారీ వర్షాలు కురవడంతో మండలంలోని పలు వాగులు సోమవారం పొంగి ప్రవహించాయి. చిన్నేరు వాగు పోటెత్తడంతో కిమ్మిలిగెడ్డ, అమ్మిరేఖల, కొత్తవీధి గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాజవొమ్మంగి శివారులో వట్టిగెడ్డ వాగు ఉధృతంగా ప్రవహించింది. బూరుగపల్లి, వయ్యేడు, ముర్లవాని పాలెం గ్రామాలకు వెళ్లే వారు గమ్యం చేరేందుకు ఇబ్బంది పడ్డారు. వట్టిగెడ్డ రిజర్వాయర్ పొర్లు కాలువ పొంగింది. మిగులు జలాలు పరవళ్లు తొక్కుతూ దిగువకు ప్రవహించాయి.

క్లుప్తంగా

బీపీఎంను బెదిరించిన ముగ్గురిపై కేసు

అరకులోయ: మండలంలోని కొత్తబల్లుగుడ బ్రాంచి పోస్టుమాస్టర్‌ను నగదు కోసం బెదిరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు అరకులోయ ఎస్‌ఐ సంతోష్ సోమవారం తెలిపారు. విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని సింహాచలం, రామన్న, సింహాద్రి అనే ముగ్గురు తనను బెదిరించి రూ.30వేలు డిమాండ్ చేసినట్టు అరకులోయకు చెందిన కొత్తబల్లుగుడ బ్రాంచి పోస్టుమాస్టర్ పోతల రవితేజ ఆదివారం ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. రూ.24 వేలను వారికి ఇప్పటికే ఇచ్చానని మిగిలిన రూ.6వేల కోసం వేధిస్తున్నారని ఆయన పేర్కొన్నాడు. అందిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి, విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

డివిజనల్ పీఆర్వోగా నారాయణరావు



డొండపర్తి: సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖ నూతన డివిజనల్ పీఆర్వో డి.నారాయణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు విజయనగరంలో ఏపీఆర్వోగా పనిచేశారు. పదోన్నతిపై విశాఖ డీపీఆర్వోగా నియమితులయ్యారు. ఆయన సోమవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరావును సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్ అభినందించారు.

ఫిజిక్స్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: జిల్లాలోని మల్కాపురం హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియెట్ భౌతిక శాస్త్రం బోధించుటకు ఆసక్తి గల అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ పరిధిలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సబ్జెక్టు టీచర్లు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలోగా అన్ని రకాల ధృవీకరణ పత్రాలను డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. గడువు తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించమని పేర్కొన్నారు.

పీఎస్‌టీ

ఇది జీఎస్‌టీకి అదనం

కార్గో షిప్స్ నుంచి పోర్టు స్పెషల్ ట్యాక్స్ వసూలు



పోర్టులో కార్గో కంటైనర్స్ హ్యాండ్లింగ్

సర్.. కంటైనర్ కార్గో వచ్చింది.. అని చెబితే చాలు.. మొత్తం లోడ్ ఎంత అని ప్రశ్న వస్తుంది. 100 కంటైనర్లు సర్.. అవునా.. ఓకే.. మొత్తం రూ.2 లక్షలు. చెప్పేసెయ్.. త్వరగా తీసుకురమ్మని చెప్పు. అలాగే సర్...

సర్.. బెర్త్ త్వరగా కావాలంట.. ఏం చెప్పమంటారు.? అవునా..? ఎంత సేపటిలో కావాలి.?? తెలుసుకదా.. మన టైమింగ్స్ గురించి.. గంటలో అయితే రూ.లక్ష కట్టియ్యమను. బెర్త్ కన్‌ఫర్మ్ చేసుకోమను..

ఇదీ.. విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) నిత్యకృత్యంగా మారిన సంభాషణలు.

పోర్టుకు షిప్ వస్తే చాలు.. పీఎస్‌టీ కట్టాల్సిందే. అంటే.. పోర్టు స్పెషల్ ట్యాక్స్. ఇది జీఎస్‌టీకి అదనం. ఓ అధికారి.. తన జేబులోకి వచ్చేలా విధిస్తున్న ట్యాక్స్ ఇది.

సాక్షి, విశాఖపట్నం : విశాఖ పోర్టు 100 హెక్టార్లలో ఇన్నర్ హార్బర్, 200 హెక్టార్లలో అవుటర్ హార్బర్ విస్తరించి ఉన్నాయి. ఇందులో ఇన్నర్ హార్బర్‌లో 22 బెర్త్‌లు, అవుటర్ హార్బర్‌లో 8 బెర్తులు చొప్పున మొత్తం 30 బెర్త్‌లు ఉన్నాయి. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ పోర్టుకు సగటున 10 కార్గో షిప్స్ హ్యాండ్లింగ్ జరుగుతుంటాయి. ఇక్కడ ఎగుమతి, దిగుమతులకు సంబంధించిన హ్యాండ్లింగ్స్‌ని నిర్వర్తిస్తుంటారు. పోర్టులోని ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో హ్యాండ్లింగ్ వ్యవహారాలు జరుగుతుంటాయి. కస్టమ్స్, ఇతర విభాగాలు సరకు ఎగుమతి దిగుమతులకు సంబంధించి సర్టిఫైడ్ చేస్తుంటాయి. ఇక్కడే అసలు కథ మొదలవుతుంటుంది. ట్రాఫిక్ విభాగంలోని ఓ అధికారి స్పెషల్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి పోర్టులో పాతుకుపోయిన సదరు ఉద్యోగి పోర్టు ఉన్నతాధికారుల్ని సైతం ఏమార్చుతున్నారు.

- ఒక్కో కంటైనర్ షిప్ నుంచి రూ.2 లక్షల వరకూ వసూళ్లు
- ముందుగా చెల్లించిన వారికే బెర్త్ కన్‌ఫర్మ్ చేస్తున్న వైనం
- అత్యవసరంగా బెర్త్ కావాలంటే మరో ట్యాక్స్ అదనం
- చక్రం తిప్పుతున్న విశాఖ పోర్టు ట్రాఫిక్ విభాగంలోని ఓ అధికారి

జేబు ట్యాక్స్ చెల్లించకుంటే..

సరుకుతో షిప్ వస్తే చాలు.. సదరు ట్రాఫిక్ అధికారి బేరసారాలు మొదలవుతాయి. వచ్చిన సరకు ఏంటి.? ఎంత బరువు ఉంది.? దాని బట్టి.. తనకు చెల్లించాల్సిన స్పెషల్ ట్యాక్స్ విధిస్తారు. దానిని స్టివడోర్స్ చెల్లిస్తే సరేసరి.. లేదంటే.. ఆ షిప్‌లోనే సరుకు ఉండిపోతుంది. ఆయన రూ.2 నుంచి రూ.5 లక్షల వరకూ తన జేబు ట్యాక్స్ విధిస్తుంటారు. స్టివడోర్స్ బేరసారాలాడి తమకు ఓకే అనుకున్న మొత్తం చెల్లించి.. హ్యాండ్లింగ్ పనులకు దిగుతారు. దీనిపై గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో.. చేసేది లేక.. సదరు ట్రాఫిక్ అధికారికి స్పెషల్ ట్యాక్స్ చెల్లించుకుంటూ తమ పనులను కానిచ్చేస్తున్నారు. ఇంకో విషయమేంటంటే.. షిప్ పోర్టుకు చేరిన తర్వాత.. బెర్త్ కన్ఫర్మ్ చేయాల్సింది కూడా ట్రాఫిక్ విభాగమే.. ఆ బెర్త్ కన్ఫర్మేషన్‌కు కూడా సదరు అధికారికి కప్పం కట్టాల్సిందే. ఇలా అందినకాడికి దోచుకుంటూ.. పోర్టులో అడ్డూ అదుపూ లేకుండా ట్రాఫిక్ విభాగాన్ని సదరు అధికారి శాసిస్తున్నారు. కొందరు ఉన్నతాధికారులకు ఈయన చేస్తున్న అవినీతి గురించి తెలిసినా.. పట్టించుకోవడం లేదంటూ తోటి ఉద్యోగులు సైతం వాపోతుండటం కొసమెరుపు.

ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు

జేసీ విశ్వనాథన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

డొండపర్తి: జిల్లాలో ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ప్యాడి ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం ఉత్పత్తిని అంచనా వేసి అందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ-క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ఆర్బీకేలకు అనుసంధానం చేసి, ప్రక్రియ సజావుగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్లస్టర్ ఆర్బీకేలలో టెక్నికల్ అసిస్టెంట్లు జిల్లాలో గన్ని బ్యాగులు ఏ మేరకు అవసరం అవుతాయో గుర్తించి, మిల్లర్ల వద్ద నుంచి సేకరించి నిల్వ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ధాన్యం రవాణాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేయాలని డీటీసీకి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్య ప్రకాశరావు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఐ.రాజేశ్వరి, జిల్లా రవాణా అథారిటీ అధికారి ఎం.బుచ్చిరాజు, జిల్లా సహకార అధికారిని ప్రవీణ, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కమిషనర్ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్(టెక్నికల్) ఎం.సృజన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తిలో అహంభావం కూడదు

- ఆత్మానందస్వామి
- రాజవొమ్మంగి మీదుగా సాగిన శౌర్య జాగరణ రథయాత్ర



రాజవొమ్మంగిలో జరుగుతున్న శౌర్య జాగరణ రథ యాత్రలో భక్తులు

రాజవొమ్మంగి: విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరుగుతున్న శౌర్య జాగరణ రథ యాత్ర సోమవారం రాజవొమ్మంగి చేరుకుంది. స్థానిక షిర్డీసాయి మందిరం వద్ద రథానికి, యాత్రలో పాల్గొన్న ఆత్మానంద స్వామి తదితరులకు భక్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం, మండలంలోని చిన రెల్లంగిపాడు, శరభవరం వరకు రథ యాత్ర సాగింది. ఆయా ఆలయాల వద్ద ఆత్మానందస్వామి ప్రసంగించారు. దైవ సేవలో అహంభావాన్ని విడనాడాలని భక్తులకు సూచించారు. శ్రద్ధ, విశ్వాసం ద్వారా భక్తి కలుగుతాయన్నారు. ఎన్నో ఏళ్ల పాటు విశ్వహిందూ పరిషత్, హిందువుల ఉద్యమాల అనంతరం అయోధ్యలో రామమందిరం నిర్మించుకోగలిగామన్నారు. జనవరి మొదటి వారంలో అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ జరుగబోతోందని, ఆ మహత్కార్యానికి భక్తులందర్నీ ఆహ్వానించడమే ఈ రథయాత్ర ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. అయోధ్యలో ప్రతిష్ఠ జరిగే రోజున అన్ని ఆలయాల్లో మామిడి తోరణాలు కట్టి, ధూపదీపాలతో పండగ చేసుకోవాలన్నారు. ఆయన వెంట విశ్వహిందూ పరిషత్ సీనియర్ కార్యకర్తలు భవన్నారాయణ, బి.వి.ఎస్.ఎస్. గుప్తా, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి

- కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఉనికి కోల్పోతున్న గిరిజనులు
- మాజీ ఎంపీ మిడియం బాబూరావు
- పాడేరులో సీపీఎం రాష్ట్ర స్థాయి సదస్సు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబురావు

పాడేరు రూరల్ : దేశ వ్యాప్తంగా ఆదివాసీల జీవన విధానం మనుగడపై కేంద్ర ప్రభుత్వ విధానాలు తీవ్ర అసంతృప్తిని కలిగిస్తున్నాయని సీపీఎం మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. ఆదివాసీ ప్రాంత సమగ్రాభివృద్ధి-సీపీఎం ప్రత్యామ్నాయ విధానం అనే అంశంపై పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అధ్యక్షతన సోమవారం పాడేరు పట్టణంలోని కాఫీ గెస్ట్ గౌస్‌లోరాష్ట్ర సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మిడియం బాబూరావు మాట్లాడుతూ ఆదివాసీల రక్షణ కొరకు రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలు, హక్కులకు కేంద్రలో బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న జీవో నెం.3 రద్దు చేయడంతో ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో కేవలం 50 శాతం మాత్రమే గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయని మిగిలిన 50 శాతం గిరిజనేతరులకు దక్కుతుందన్నారు. ఈ విషయంలో గిరిజనులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని స్పష్టం చేశారు. జీవో నెం.3 పునరుద్ధరణకు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలన్నారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ రద్దు చేసి ట్రైబల్ స్పెషల్ స్కీం పేరుతో కొనసాగిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో నిధులను కేటాయించడం లేదన్నారు. అటవీ పరిరక్షణ చట్టాన్ని సవరించి కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా ప్రయత్నిస్తోందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం ట్లాడుతూ ఆదివాసీల సమగ్రాభివృద్ధి లక్ష్యంతో రాష్ట్రంలో ఈనెల 21 నుంచి సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పాలకొండ నుంచి పార్టీ ప్రజా రక్షణ భేరి యాత్ర ప్రారంభిస్తామన్నారు. మన్యం జిల్లోని అన్ని మండలాలతో అల్లూరి జిల్లాలోని అన్ని మండలాలను కలుపుతూ ఈ యాత్ర చేపట్టి నవంబర్ 1నాటికి యాత్ర విజయవాడ చేరుకుంటుందన్నారు. అనంతరం ఆదివాసీల సమగ్రాభివృద్ధిపై సీపీఎం పార్టీ పలు తీర్మానాలు చేశారు. సీతారాం, సురేంద్ర, అనంతగిరి జెడ్పీటీసీ డి.గంగరాజు, నాయకులు ఉమామహేశ్వరరావు, చిన్నయ్యపడాల్, హైమవతి, చిన్నంనాయుడు, అవినాష్, అప్పన్న, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌పాయిజన్‌తో 14 మందికి అస్వస్థత

- గాజువాక మండి క్రూడ్స్ రెస్టారెంట్‌లో ఘటన
- కేజీహెచ్‌లో చికిత్స అనంతరం డిశ్చార్జ్



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులు

అక్కిరెడ్డిపాలెం/దాబాగార్డెన్స్: ఫుడ్‌పాయిజన్‌తో 14 మంది యువకులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని 108లో కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించడంతో ముప్పు తప్పింది. ఈ ఘటన గాజువాకలోని మండి క్రూడ్స్ రెస్టారెంట్‌లో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాక ములగాడ ఎస్సీ కాలనీకి చెందిన 14 మంది యువకులు ఆదివారం రాత్రి వినాయక అనుపోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం గాజువాకలోని మండి క్రూడ్స్ రెస్టారెంట్‌లో బిర్యానీతో పాటు వింగ్స్ మండి, డ్రమ్స్ స్టిక్స్, డ్రింక్, మైనస్(క్రీమ్) తిన్నారు. తర్వాత వారంతా ఇళ్లకు చేరుకున్నారు. సోమవారం ఉదయం వారంతా కడుపునొప్పి, తలనొప్పి, విరేచనాలు, వాంతులతో అస్వస్థతకు గురవగా కుటుంబ సభ్యులు 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందిన అనంతరం 11 మంది వెంటనే.. మరో ముగ్గురు కొంతసేపటికి తర్వాత డిశ్చార్జ్ అయ్యారు. దీనిపై గాజువాక పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే కేసు నమోదు చేసి వివరాలు సేకరించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అలర్ట్ అయ్యారు. ఫుడ్ శాంపిల్స్ సేకరించారు. రెస్టారెంట్‌పై చర్యలకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం.

శ్లాబ్ పలక మీద పడి విద్యార్థి దుర్మరణం

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ
- ఘటనా స్థలాన్ని సందర్శించిన కలెక్టర్, డీఈవో
- వేరే భవనంలో తరగతులు నిర్వహించాలని ఆదేశం



మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి



సంఘటన స్థలంలో జారి పడిన పలక

పాయకరావుపేట: పట్టణంలోని దుర్గానగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్మాణంలో ఉన్న బాత్‌రూం శ్లాబ్ పలక జారి పడి సోమవారం విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. ఈ పాఠశాలలో రూ.15 లక్షలతో నాడు నేడు పనులు జరుగుతున్నాయి. పాఠశాల వెనుక భాగంలో విద్యార్థుల కోసం మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. శ్లాబ్ వేసి రెండు రూములు నిర్మించారు. పిట్టగోడ కట్టే నిమిత్తం కాంట్రాక్టర్ సిమెంట్ పలక ఏర్పాటు చేశాడు. పలక కిందకు పడిపోకుండా సపోర్టుగా కర్ర పెట్టాడు. పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న తులసి సిద్దూ ప్రసన్న కుమార్ (9) భోజన విరామ సమయంలో తోటి స్నేహితులతో కలసి నిర్మాణంలో ఉన్న బాత్‌రూం వద్దకు వెళ్లి, సపోర్టుగా ఏర్పాటు చేసిన కర్రను లాగడంతో పలక జారిపడింది. పలక తలకు తగలడంతో తీవ్ర రక్తస్రావమవుతున్న విద్యార్థిని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పాఠశాలలో నాడు నేడు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే సిమెంట్ పలక తన కుమారుడిపై పడి మరణించాడని విద్యార్థి తండ్రి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిర్మాణంలో ఉన్న భవనాల్లోకి విద్యార్థులు వెళ్లకుండా రక్షణ ఏర్పాటు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి తల్లిదండ్రులు కాకినాడకు చెందిన వారు. ఉపాధి కోసం పాయకరావుపేట వలస వచ్చారు. తండ్రి పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, డీఈవో వెంకటలక్ష్మమ్మ హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చారు. ఆస్పత్రి మార్చురీలో ఉన్న విద్యార్థి మృతదేహాన్ని సందర్శించి, విద్యార్థి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పాఠశాలలో పనులు పూర్తయ్యే వరకు తరగతులను వేరొక భవనంలో నిర్వహించాలని ఎంఈవో గాంధీని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం పాఠశాలకు సెలవు ప్రకటించారు. అవకాశం ఉన్నంతమేర బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే బాబూరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించామని సీఐ అప్పలరాజు, ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

విద్యార్థులతో వెట్టిచాకిరీ ప్రచారం అవాస్తవం

సీలేరు: మండలంలో దారకొండ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నట్టు వస్తున్న వార్తలు అవాస్తమని అధికారులు తెలిపారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎం తోటి ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, సిబ్బంది, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విద్యార్థులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నట్టు పలు ఆరోపణలతో కూడిన వాట్సాప్‌లు చక్కర్లు కొడుతున్నాయని, ఇందులో వాస్తం లేదని హెచ్‌ఎం సుందరావు చెప్పారు. ఈ విషయంపై హెచ్‌ఎం హేమసుందర్ మాట్లాడుతూ బియ్యం అయిపోవడంతో గ్రామంలో ఉన్న జీసీసీ డిపో నుంచి బియ్యం బస్తాలు తీసుకురావడంతో పక్కనే ఆడుకుంటున్న పిల్లలు సాయం చేశారని, అదే సమయంలో పాఠశాలకు గ్యాస్ సిలిండర్లు వచ్చాయని, ఈ నేపథ్యంలో వాటిని స్టోర్‌రూమ్‌లో ఉంచేందుకు పలువురు సాయం చేశారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థులతో వెట్టిచాకిరీ ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

బండారు బహిరంగ క్షమాపణ చెప్పాలి

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు

దాబాగార్డెన్స్: రాష్ట్ర మంత్రి రోజాపై మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. దాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి రోజా సినీ రంగంలోనూ, రాజకీయంలో సక్సెస్ అయ్యారన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి, 6 లక్షల కోట్లు అవినీతికి పాల్పడిన విషయమై మంత్రి రోజా మాట్లాడారే తప్పా స్వార్థ రాజకీయాల కోసం కాదన్నారు. చంద్రబాబు జైల్లో, లోకేష్ ఢిల్లీలో ఉండడం వల్ల పవన్‌కు పగ్గాలు అప్పగించడానికి టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 సీట్లు గెలుచుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏజెన్సీలో పర్యాటకాభివృద్ధికి చర్యలు

రంపచోడవరం పీవో సూరజ్‌గనోరే



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

రంపచోడవరం: ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ఆయా గ్రామాల ప్రజలు పూర్తిగా సహకరించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో సోమవారం రంప గ్రామంలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం అభివృద్ధికి రంప గ్రామ ప్రజలకు తోడ్పాటును అందించాలని పీవోను గ్రామస్తులు కోరగా వెంటనే పీవో స్పందించి రంప గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ముందుగా రంప గ్రామంలో కొండపై ఉన్న శివాలయం పర్యాటక ప్రాంతం గురించి పీవో ఆరా తీశారు. శివాలయానికి వచ్చే భక్తుల నుండి టికెట్ రూపంలో వచ్చిన డబ్బులు ఒక కమిటీ ఏర్పాటు చేసుకొని నిల్వ చేయాలన్నారు. ఇక్కడ వచ్చిన డబ్బులు గ్రామ కమిటీ ఫారెస్ట్ అధికారులు, ఎంపీడీవోతో ఒక జాయింట్ అకౌంట్ తప్పనిసరిగా ఉండాలని పీవో తెలిపారు. రంప శివాలయం కొండమీద ఫారెస్ట్ శాఖకు సంబంధించిన భూమి ఉందని, అటవీ హక్కుల చట్టం ద్వారా కొండపోడు పట్టాలు కూడా ఇవ్వడం జరిగిందని అందుకు ఫారెస్ట్ శాఖకు అందరు సహకరించాలన్నారు.ఈ పర్యటక ప్రాంతానికి టూరిస్ట్ ల ద్వారా వచ్చిన డబ్బులతో ప్రతి సంవత్సరం ఆడిట్ చేయించి అదేవిధంగా శివరాత్రి ఉత్సవాలకు ఇక్కడ వచ్చిన డబ్బులు వినియోగించాలన్నారు. టూరిజం ప్రాంతంలో పారిశుధ్య కార్యక్రమాలు కూడా పక్కాగా నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ వచ్చిన డబ్బులు బ్యాంకు నుండి తీసుకోవాలంటే కమిటీ సభ్యుల తీర్మానాలతో డబ్బులు విత్‌డ్రా చేయాలాన్నరు. రంప గ్రామంలో మరొక తాగునీటి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని ప్రస్తుతం ఉన్న వాటర్ ట్యాంక్ మరమ్మత్తులు చేయించాలని, గ్రామంలో సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని. రంపచోడవరం నుండి రంప వచ్చు మార్గ మధ్యలో రోడ్డు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు పీవో దృష్టికి తీసుకురావడం జరిగింది. గ్రామంలో సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ సి హెచ్. శ్రీనివాసరావు,ఎస్సై రాజు. రంప గ్రామస్తులు మిరియాల సోమన్న దొర,మడి లక్ష్మయ్య, మామిడి తమ్మిరెడ్డి, కొమరం శాంతిరాజు, మట్ల వాణిశ్రీ,ఐ.రమణ తదితరులు పాల్గొన్నారు .

అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన



విద్యార్థులను ఇంటర్వ్యూలు చేస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాను జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి ప్రారంభించారు. ప్రభుత్వం మేళాల ద్వారా కల్పిస్తున్న అవకాశాలను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాంకేతిక విద్యకు మంచి డిమాండ్ ఉందన్నారు. మేళాకు 102 మంది అభ్యర్థులు హాజరు కాగా 35 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మేళాలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐటీడీఏ స్పందనలో వినతుల వెల్లువ



వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యలపై గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి, మరికొన్ని సమస్యలకు సంబంధించిన అర్జీలు పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపినట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. స్థానిక ఐడీడీఏ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో స్పందన కార్యక్రమం రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏపీఓ జనరల్ సి హెచ్ శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ ఈ వారం సుమారు 56 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. భూములకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయన్నారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని మంగంపాడు గ్రామంలో గ్రామ సచివాలయం ఏర్పాటు చేయాలని, తుష్లూరు గ్రామంలో సోలార్ ప్యానల్స్ మరమ్మతు చేయాలని, మంగంపాడు గ్రామంలోని తాగునీటికు సంబంధించిన రెండు మోటార్లు రిపేర్ చేయాలని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, బొడ్డగండి పంచాయితీలోని 18 గ్రామాలలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని సరంకోట అబ్బాయి రెడ్డి, నైని పండయ్య, బట్ట వీరయ్య దరఖాస్తు సమర్పించారు. అడ్డతీగల మండలం డి.కొత్తూరు గ్రామంలో ఎంపీపీ స్కూల్లో మరుగుదొడ్లు, వంటశాల ఏర్పాటు చేయాలని సర్పంచ్ అచ్చియమ్మ. స్కూల్ కమిటీ చైర్పర్సన్ జి.భద్రమ్మ అర్జీ అందజేశారు. రంపచోడవరం మండలం నుంచి నేషనల్ హైవే 516 రోడ్డుకు ఇరువైపులా భూములు, స్థలాలు నష్టపోయిన గిరిజనులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ అమలు చేయాలని సర్పంచ్ వంతల అచ్చియమ్మ. బాపన్న దొర. ధర్మరాజు దరఖాస్తు సమర్పించారు.